

ఓం నమో భగవతే శ్రీరమణాయ



# రమణ భాస్కర

## (హైదరాబాద్‌లో నాన్నగారి ప్రవచనము, 7-8-98)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

సమగ్రమైన జ్ఞానం, సమగ్రమైన వైరాగ్యం, సమగ్రమైన యశస్సు, సమగ్రమైన ఐశ్వర్యం అన్ని సమగ్రంగా ఉన్నవాడు భగవంతుడు. భగవంతుడియొక్క అనుగ్రహం లేకుండా భగవదనుభవం మనకు కలుగదు. భగవంతుడు అనేక రూపములలో ఈ భూమిమీద మనకు వ్యక్తమవుతున్నాడు. మీకు నచ్చిన రూపాన్ని, నచ్చిన నామాన్ని తీసుకొని ఉపాసన చేస్తే భగవధనుగ్రహానికి పాత్రులవుతారు. భగవధనుగ్రహానికి ఎవరైతే పాత్రులయ్యారోవారికి భగధనుభవం కలుగుతుంది. గృహప్రవేశసందర్భములో జ్యోతిప్రజ్వలన చేస్తారు, కొబ్బరికాయలు కొడతారు ఎందుకు మానవుడికి జీవితంలో వెలుగు యొక్క ప్రాముఖ్యత చెప్పటం కోసం జ్యోతి ప్రజ్వలన చేస్తారు. జ్యోతి అంటే ప్రకాశం, వెలుగు. జీవితంలో మనం వెలుగు లేకుండా జీవించలేము. మనం ఉన్నా, వస్తువులు ఉన్నా వెలుతురు లేకపోతే వస్తువులు ప్రకాశించలేవు. కొబ్బరికాయల పైన ఉన్న పేడు గట్టిగా ఉంటుంది. ఆపేడు ఎంత గట్టిగా ఉంటుందో మన అహంభావన అంత గట్టిగా ఉంది. కొబ్బరికాయలోపల గుంజు ఉంది, నీరు ఉంది. పైన ఉన్న పెంకును గట్టిగా కొట్టి, కొట్టి దానిని పగల గొడితేగాని లోపలఉన్న నీరు మనకు దొరకదు, గుంజుమనకు దొరకదు. అదేవిధంగా మనం సాధన చేసి అహంభావన అనే పెంకును కొడితేనే గాని అది నశించదు, అది నశిస్తే గాని మన హృదయంలో ఉన్న ఆనందం, శాంతి మనకు దొరకదు. కొబ్బరికాయ పైన ఉన్న పెంకు పగలకూడదు, గుంజు, నీరు కావాలి అంటే ఎలాకుదురుతుంది. గుంజు, నీరు కావాలంటే పైన ఉన్న పెంకును పగలగొట్టి తీరాలి. అలాగే నీలోపలఉన్న శాంతి, ఆనందం నీకుకావాలంటే అహంభావనను తొలగించుకోవాలి. అహంభావనపోతే గాని మన హృదయంలో ఉన్న జ్ఞానగంగ మనకు దొరకదు. ఇది తెలియజేయటం కోసం మన పూర్వీకులు ఈవిధంగా పెట్టారు. మనం మెకానికల్‌గా చేస్తున్నాము, తెలియక చేస్తున్నాము. మనం పనిచెయ్యాలి. చేసేపని ఎందుకు చేస్తున్నామో తెలిసిచేస్తేమంచిది. అలా తెలుసుకొని చేస్తూఉంటే మనలో ఉన్న వివేకం మేల్కొంటుంది. మనలో ఉన్న వివేకంమేల్కొంటేనేగాని మనం సుఖపడలేము.

గురువు అంటే ఆప్తుడు. ఆప్తుడు అంటే మన శరీరానికి బంధువుకాదు, లోపల ఉన్న జీవుడికి బంధువు. ఎక్కడ ఉన్నా మనక్షేమం కోరేవాడు. శరీరం పోయిన తరువాత జీవుడు ఎక్కడకు ప్రయాణం చేసినా, ఏలోకంలో ఉన్నా మరలకొత్త శరీరంలో ఎక్కడ ఉన్న ఆజీవుడిని గురువు చూసుకొంటూ ఉంటాడు. జీవుడు తన గమ్యాన్ని చేరేవరకు గురువు బాధ్యత వహిస్తాడు. గురువు అన్నా, ఈశ్వరుడు అన్నా, ఆత్మఅన్నా ఒక్కటే అని భగవాన్ తరచు చెపుతూ ఉండేవారు. మన రంగులువేరైనా, గుణాలు

వేరైనా, కులాలు వేరైనా, శరీరాలు ఏదోరోజు చనిపోయినా ఈ రంగులతోటి, గుణాలతోటి, ప్రాంతాలతోటి, స్వభావాలతోటి సంబంధం లేకుండా అందరి హృదయాలలో స్వతంత్రంగా ఒక వస్తువు ప్రకాశిస్తోంది. అది సౌమ్యంగా ఉంటుంది, శాంతంగా ఉంటుంది, జ్ఞానంగా ఉంటుంది, ఎరుక తోటి ఉంటుంది. మన అందరి హృదయాలలో ఏవస్తువు అయితే స్వయంగా ప్రకాశిస్తోందో అదే మనకు నిజమైన గురువు. మన హృదయంలో ఉన్న వస్తువు మనకు తెలియక పోవచ్చును కాని అదే మన గురువు.

దేని ప్రకాశం వలన మనం లోకాన్ని చూస్తున్నామో, దేని ప్రకాశం వలన మనకు వచ్చే తలంపులను చూసుకొంటున్నామో, దేని ప్రకాశం వలన మన శరీరాన్ని చూసుకొంటున్నామో ఆప్రకాశం ఉందా, లేదా అని అనుమానిస్తున్నాము. దేని ఆధారంగా మనం జీవిస్తున్నామో ఆ ఆధారాన్ని మనండౌట్ చేస్తున్నాము. ఆప్రకాశాన్ని పొందాలనే మినహాయింపులు లేనివాంఛ, దానిని తెలుసుకోవాలనే తీవ్రమైనకాంక్ష మనకు బలీయంగా లేనప్పడు ఎన్నిపూజలు చేసినా, జపాలుచేసినా, నదులలో మునిగినా ఇవి అన్నీ ఒకటి లేని సున్నలతో సమానము. మనం ధ్యానం చేస్తున్నాము, ఎందుకు చేస్తున్నాము? హృదయంలో ఉన్న ప్రకాశాన్ని తెలుసుకోవాలనే కాంక్ష తోటి ధ్యానం చేస్తేనే ఆధ్యానం ప్రకాశం వైపుకు మళ్ళించబడుతుంది. ఏ లక్ష్యం కోసం మనం ప్రయత్నం చేసున్నామో దాని మీద ఇష్టం ఉండాలి, దానిని పొందాలి అనే తపన ఉండాలి. అప్పడు అది మనకు ఎరుకపడుతుంది.

మనం ఆశ్రయింపదగినవాడు భగవంతుడు ఒక్కడే. నామరూపములే దు:ఖానికి కారణం. భగవంతుని రూపములలో ఒక రూపమును తీసుకొని దానిని ధ్యానిస్తూఉంటే ఆనామమును స్మరిస్తూ ఉంటే లోకంలోని నామ, రూపములకు దూరమవుతావు, భగవంతుడికి దగ్గరవుతావు. నిప్పదగ్గరకు వెళితే వేడి మనకు ఎలా తెలుస్తుందో అలాగ భగవంతుడిని సమీపించే కొలది భగవదనుగ్రహంమీకు తెలుస్తూ ఉంటుంది. మానవుడు ఉన్నదానితో తృప్తి పడడు. భౌతికపరిస్థితులు అభివృద్ధి పరచుకోవటానికి ప్రయత్నిస్తాడు. దాని కోసం భగవంతుడిని ప్రార్థిస్తాడు. కోరికలకోసం భగవంతుడిని ప్రార్థించినా మీరుకూడా భక్తులే. కోరికలు నెరవేరగా, నెరవేరగా భగవంతుడి కృపను కూడా కోరాలని భగవంతుని స్వరూపాన్ని మనం పొందాలి అని మీకు అనిపిస్తుంది. కొంతమంది వారికి లాభం కలుగదు అంటే చిన్న నవ్వుకూడా నవ్వరు. దీనికి కారణం సామాజిక స్పృహలేకపోవటం. సామాజిక స్పృహలేనివాడికి దైవం యొక్కవిలువ తెలియదు. నీవు ఆశించనా,ఆశించకపోయినా కర్మఫలం వస్తుంది. కర్మఫలాన్ని ఆశిస్తే నీమనస్సు మలినం అవుతుంది. కర్మచేస్తాము. కర్మఫలాన్ని మనం అనుభవిస్తాము. అనుభవించినప్పడు వాసన పడుతుంది. వాసనలోనుండి కోరికవస్తుంది. మరలకోరిక కోసం పనిచేస్తాము. ఇది కర్మచక్రం. ఈ కర్మచక్రం నుండి విడుదలపొందాలంటే గురువు అనుగ్రహం అవసరం.

నీవు చెడును చెయ్యటం ఆపుచెయ్యి, చెడు ఆలోచించటం ఆపుచెయ్యి. మహర్షుల దగ్గరకు

వెళ్ళి వారిపాదాల దగ్గర కూర్చో. వారు చెప్పినది శ్రద్ధగా శ్రవణంచెయ్యి. ఇంటికి వెళ్ళి మననం చెయ్యి. నీహృదయంలో ఉన్న నిజమైన గతి నీకు ఎరుక పడుతుంది. మీరాభాయి భౌతిక జీవితంలో ఎంతో ఘర్షణ పడింది దగ్గరవారు కూడా ఆవిడిని వదిలేశారు. అయినా ఎప్పుడూకూడా కృష్ణుడిని ప్రేమించటంలో సందేహానికి తావు ఇవ్వలేదు. నిరంతరం కృష్ణుడిని స్మరించింది, తరించింది. ఒకసారి మీరాభాయి ఒక స్వాములవారి దర్శనానికి వెళ్ళింది. మేము పురుషులకే దర్శనం ఇస్తాము, స్త్రీలకు దర్శనం ఇవ్వము అని ఆ స్వాములవారు లోపలనుండి కబురు చేసారు. పురుషుడు అనే వాడు ఒక్కడే ఉన్నాడు. వాడికి లింగబేధం లేదు, మతబేధం లేదు, దేహబేధం లేదు. నేను పురుషుడిని అనుకొంటున్నాడు అంటే వాడికి ఇంకా దేహబుద్ధి పోలేదు, దేహానికే పరిమితమై ఉన్నాడు. ఇంకవాడికి దేవుడు ఏమి తెలుస్తాడు. ఏదైతే ఆత్మ అనుకొంటున్నామో, ఏదైతే మనం ఎప్పుడూ ఉంటుంది అనుకొంటున్నామో, దేని స్వరూపం అయితే ఆనందం అనుకొంటున్నామో అది పురుషుడు గాని తలుపులు వేసుకొని లోపల కూర్చొన్నవాడు పురుషుడు కాదే అంది మీరాభాయి.

ఈశ్వరుని ప్రార్థించగా ప్రార్థించగా, ఈశ్వరునికోసం జీవించగా జీవించగా, అవసరమైతే ఆయన కోసం మరణించటానికి సిద్ధంగా ఉంటే అప్పుడు ఈశ్వరుని కృప వచ్చి నీకోసం ఒక రూపం దాల్చుతుంది, ఒకపేరు పెట్టుకొంటుంది. నీకోసం రూపందాల్చివస్తుంది ఆరూపం ఎవడో కాదు వాడే గురువు . గురువు అంటే ఎవడో అనుకొంటున్నారు. గురువు అంటే ఎవడోకాదు ఈశ్వరుని కృపే ఆరూపంలో వచ్చింది గురువు తన స్వరూపాన్ని మీకు ఇచ్చేవరకు మిమ్మల్ని వెంటాడుతాడు. గురువు మీద మీకు ప్రేమలేక పోయినా ఆయన మీద ప్రేమకలిగేటట్లు ఆయనే చేసుకొంటాడు. ఆయనే గురువు. మనకుచూడటం ఎక్కువ అలవాటు అయిపోయిదేవుడు ఎప్పుడు కనిపిస్తాడా చూద్దాము అని కనిపెట్టుకొని ఉంటున్నాము. అందువలన భగవంతుడు రూపంధరించినీకు కనబడతాడు. దేవుడు అంటే చూడటంకాదు, దేవుడు అంటే ఉండటం దృశ్యం అదృశ్యమవుతుంది. యోగం వియోగం అవుతుంది. కలియక ఎప్పుడైతే ఉందో విడిపోవటం కూడా అప్పడే ఉంది. అయితే సర్వకాలసర్వావస్థలలో ఒక్కక్షణంకూడా నిన్ను విడిచి పెట్టకుండా ఉండే వస్తువు ఒకటి ఉంది అదే నీగతి, అదే నీపతి. అది నీవుచేరుకొన్నావా ఇంక ఒక్కక్షణం కూడా నీకు వియోగం లేదు.

మౌనబోధ స్థూలబుద్ధి గ్రహించలేదు, సూక్ష్మబుద్ధిగ్రహిస్తుంది. మౌనబోధనీకుఅందదు. అంత పవిత్రత, ఏకాగ్రత, సూక్ష్మత నీదగ్గరలేదు. అందువలన భగవంతుడియొక్క కృపరూపంధరించివచ్చి నీతో మాట్లాడుతుంది. మనకు విషయాలపట్ల ఎంత అనురాగం ఉందో ఈశ్వరునిపట్ల అంత అనురాగంఉంటే చాలు ఈశ్వరుడు మనకోసం రూపంధరించివస్తాడు. రావటమేకాదు మీకుబోధిస్తాడు. తన సాంగత్యం వలన మీమనస్సును నిర్మలం చేస్తాడు. తన మాటద్వారా, చూపుద్వారా, చేతద్వారా నిన్ను హృదయగుహవైపుకు గెంటుకుంటూపోతాడు. వాడే గురువు వాడి మాటఅనుగ్రహం, వాడికోపం కూడా అనుగ్రహమే. పనిద్వారా అనేక మంచి విషయాలు నేర్చుకోవాలి. పనిచేసేటప్పుడు మనలో ఏబలహీనత ఉందో మనకు తెలుస్తుంది. అందరూ పొగిడేవారిమధ్యనే

కాకుండా విమర్శించేవారి మధ్యన కూడా కూర్చొంటే మనమనస్సు ఎలా ఉందో మనకు తెలుస్తుంది. మా అత్తగారునాతో మాట్లాడంలేదు, నాతోడికోడలు నాతో మాట్లాడటంలేదు అని ఎవరైనావచ్చి భగవాన్‌తో చెప్పితేఎలాగైనా నీవు వారిని విడిచిపెట్టాలి. నీవు విడిచిపెట్టకముందే వారు నిన్ను వదిలి వేసారు నీకు మంచి జరిగింది. నేను విడిచి పెట్టేసాను అనే తలంపు నీకు రాకుండా వారు నీకు ఉపకారంచేసారు. నీవు లోకాన్ని విడిచిపెట్టాలి అనుకో నీవు విడిచిపెట్టలేకపోతున్నావు అనుకో ఆలోకమే నిన్ను విడిచిపెట్టేస్తే ఎంత బాగుంటుంది. దేనినైతే ప్రయత్నంచేసి నీవువిడిచిపెట్టలేకపోతున్నావో ఆవస్తువే నిన్ను విడిచిపెట్టేస్తే ఎంత బాగుంటుంది. గురువు ఏమి చేస్తాడు అంటే నీమనస్సును పవిత్రం చేస్తాడు, నీ మనస్సుకు బలం చేకూర్చుతాడు అప్పడు నీమనస్సు చలించదు, గాలిలేనిచోట దీపం ఎంత స్థిరంగా ఉంటుందో నీ మనస్సును అంతస్థిరం చేస్తాడు. వాడి సాహచర్యం నీకుఇచ్చి నీమనస్సును అస్థితికి మోసుకొనిపోతాడు. అప్పడు ప్రకృతి విషయాలకుగాని, నీ ప్రారబ్ధం తీసుకొని వచ్చే విషయాలకు గాని నీమనస్సులొంగదు, నీమనస్సు కృంగదు. ఆస్థాయికి నీమనస్సును గురువు మోసుకొనిపోతాడు. నీకు తెలియకుండా నీమనస్సును హృదయం యొక్క లోతులలోనికి తీసుకొనిపోతాడు. ఏవస్తువును తెలుసుకొన్నాక నీకు పూర్తి స్వేచ్ఛ కలుగుతుందో ఆవస్తువు నీకు తెలియకపోయినా నీగురువుకు తెలుస్తూఉంటుంది కాబట్టి అక్కడికి నీమనస్సును ఉపసంహరిస్తూ ఉంటాడు. వాడేగురువు. గురువుకు శరీరంతో పనిలేదు. శరీరంలో ఉన్నప్పడు కూడా తాను శరీరమాత్రుడను కాదు అని గురువుకు తెలుస్తూ ఉంటుంది. నీతో మాట్లాడటంకోసం నోరువేసుకొని వస్తాడు, నీతో సాహచర్యం కోసం కాళ్ళు, చేతులు వేసుకొని వస్తాడుగాని కాళ్ళు, చేతులు, నోరు గురువుకు అక్కరలేదు. ఈలోకంలోనికి ఎందుకు వచ్చామో మనం మర్చిపోవచ్చు ఎందుకంటే మనం పిల్లలంకాబట్టి. గురువు ఏ పనికోసం లోకంలోనికి వచ్చాడో ఆయన మర్చిపోడు. గురువు శరీరం ఉండవచ్చు, లేకపోవచ్చు. శరీరం ఉన్నప్పడు కూడా ప్రేమించేది శరీరంకాదు. ఏదైతే మనలను ప్రేమిస్తోందో. ఏదైతే మనకు గైడెన్స్ ఇస్తుందో దానికి చావులేదు. నీశరీరానికి చావుఉందిగాని నీలోపల ఒక చావులేని వస్తువు ఉంది. అదే ఆత్మ, అదే చైతన్యము. నీలోపల ఉన్న చైతన్యం మీద విశ్వాసమును చెదరగొట్టుకోవద్దు, ఎట్టి పరిస్థితులలోను విశ్వాసం రాలిపోకుండా చూసుకో, ఒక్కఆత్మవిషయం తప్పించి మిగిలిన విషయాలు ఏది మాట్లాడినా ఆ, ఊ, ఆ,ఊ, అనే వారు భగవాన్. మాటలు పొడిగించేవారుకాదు, మాటలు కట్‌చేసేవారు ఎందుచేతనంటే అది అంతా దుమ్ము అని ఆయనకు తెలుసు. వాటి గురించి మాట్లాడటంవలన కాలం, శక్తి, వృథా అవుతుంది అని ఆయనకు తెలుసు. నీ మనస్సును ఎక్కడకు మేల్కొలపాలో అదే చూసుకొనేవారుగాని వీటికి ప్రాముఖ్యత యిచ్చేవారుకాదు.

## జిన్నూరులో శ్రీ నాన్నగారి ప్రవచనము

## *8-11-98 న జరుగును*